క్లుప్తంగా

వీరభద్రస్వామికి విశేష పూజలు



మనుబోలు: స్థానిక శ్రీభద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో శత వార్షిక వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అర్చకులు శ్రీనివాసులు వేద మంత్రోచ్చారణల నడుమ మహా గణపతి హోమం, గణపతి పూజ, స్వస్తి పుణ్యావాచనం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, దేవీఖడ్గమాలార్చన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయకర్తలుగా చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, సుజాతమ్మ దంపతులు వ్యవహరించారు.

ఉచిత వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం: వడ్డిపాళెంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని అనన్య డయాబెటీస్ అండ్ జనరల్ క్లీనిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ కామాక్షయ్య రోగులకు ఉచితంగా షుగర్, బీపీ, ఈసీజీ, తదితర పరీక్షలను నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటారు బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. నెల్లూరులోని వేదాయపాళెం ప్రాంతానికి చెందిన షేక్ ఖాజామస్తాన్ మోటార్ సైకిల్‌పై కసుమూరు దర్గాకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్లే క్రమంలో కసుమూరు మలుపురోడ్డు వద్ద అడ్డు వచ్చిన ఆటోను తప్పించబోయి మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో కిందపడిపోయి గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

కొడవలూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు వలంటీర్లకు సేవా పురస్కారాలు

కోవూరు: స్థానిక వెలుగు కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా వలంటీర్లకు సేవా పురస్కారాలను సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అందజేయనున్నట్లు డీపీఏబీ చైర్మన్ నిరంజన్ బాబురెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పీఎంకిసాన్ ఈ-కేవైసీకి ఫేస్ ఐడెంటిఫికేషన్

కొడవలూరు: పీఎం కిసాన్ ఈ కేవైసీకి వేలి ముద్రలు పడని రైతుల సౌకర్యార్థం ఫోన్‌లో ఫేస్ ఐడెంటిఫికేషన్ సదుపాయం కల్పించారని ఏఓ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలి ముద్రలు పడని రైతులు ఆర్బీకేలలో సంప్రదించి ముఖచిత్రం ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పీఎంకిసాన్ నగదు అందుతుందని తెలిపారు.

హెచ్ఐవీ బాధితులకు అండగా నిలవాలి

నెల్లూరు(అర్బన్): హెచ్ఐవీ రోగులకు అండగా ఉంటూ వారిపై ప్రేమను పంచాలని ఏడీ ఎంహెచ్ఓ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్ఐవీ బాధితులకు సంఘీభావం తెలుపుతూ క్యాండిల్ ర్యాలీని ప్రభుత్వ బీఈడీ కళాశాల నుంచి వైద్య శాఖ కార్యాలయం వరకు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్ఐవీ రహిత జిల్లాగా నెల్లూరును మార్చాలని కోరారు.

సాయికృష్ణకు అవార్డు ప్రదానం

నెల్లూరు(దర్గామిట్ట): డిప్యూటీ తహసీల్దార్ సాయికృష్ణకు కార్టూనిస్ట్ అవార్డు లభించింది. ప్రముఖ కార్టూనిస్ట్ తలిశెట్టి రామారావు జయంతిని పురస్కరించుకొని హాస్యానందం మాసపత్రిక ఎడిటర్ రాము, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రమణాచారి, ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి ఆధ్వర్యంలో కార్టూనిస్ట్ పోటీలను నిర్వహిస్తున్నారు. 2023కు గానూ నిర్వహించిన పోటీల్లో ఇందుకూరుపేటకు చెందిన డిప్యూటీ తహసీల్దార్ సాయికృష్ణకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. నెల్లూరుకు చెందిన కార్టూనిస్ట్ రామ్‌శేషుకు విశిష్ట బహుమతి లభించింది.

వలంటీర్లకు 'వందనం'

రవి కిరణాలు భూమికి చేరకముందే పింఛన్‌దారుల ఇళ్ల తలుపు తట్టి పింఛన్లు అందజేస్తారు వలంటీర్లు. ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో వారి పాత్ర కీలకం. కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివి. వారి సేవలను గుర్తిస్తూ ఏటా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవలందించిన వలంటీర్లను పురస్కారాలతో సత్కరిస్తోంది. అందులో భాగంగా కోవూరు నియోజకవర్గంలోని వలంటీర్లను సన్మానించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: ఒకటో తేదీ వచ్చిందంటే ఎన్ని కష్టాలు ఉన్నా, ఎన్ని సమస్యలు ఉన్నా తక్కున పింఛన్‌దారుల ఇళ్ల తలుపులు తట్టి మరీ వారికి సామాజిక పింఛన్లను అందజేస్తున్న వలంటీర్ల సేవలకు రాష్ట్ర ప్రభుత్వం వందనం చేస్తోంది. అంతే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించడంలో వలంటీర్ల పాత్ర మరువలేనిది. వలంటీర్లు వారికి కేటాయించిన 50 నుంచి 70 ఇళ్లకు వెళ్లి వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను వివరించడంతో పాటు అర్హత ఉండి అందని పథకాలను అందుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నారు.

కోవిడ్ సేవలు అమోఘం

2020 మార్చిలో మన దేశంలోకి ప్రవేశించిన కోవిడ్ ప్రజానీకాన్ని అతలాకుతలం చేసింది. ఆ సమయంలో మధ్య తరగతి, పేదవారికి అండగా నిలిచింది కేవలం వలంటీర్లు మాత్రమే. ఏ ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారో తెలియదు కాని కోవిడ్ సమయంలో వలంటీర్లు లేకపోతే తమ పరిస్థితి ఏమిటి అనే ఆలోచనలో ప్రజలు ఉండిపోయారు. ఆ సమయంలో ప్రాణాంతకమైన కోవిడ్‌ను కూడా లెక్క చేయకుండా ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ సాయాన్ని అందించడంతో పాటు వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ వారికి కావాల్సిన అవసరాలను తీర్చిన ఘనత వలంటీర్లదే.

మండలం	సేవావజ్ర	సేవారత్న	సేవామిత్ర
బుచ్చిరెడ్డిపాళెం	2	10	391
విడవలూరు	0	5	251
ఇందుకూరుపేట	1	5	295
కొడవలూరు	1	5	135
కోవూరు	1	5	325

నేడు సన్మాన కార్యక్రమం ప్రారంభం

గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ల సేవలను గుర్తించి వారికి సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కరిస్తోంది. ఈ ఏడాది వలంటీర్లకు సన్మాన కార్యక్రమాన్ని ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. సేవావజ్ర కింద రూ.30 వేలు, సేవారత్న కింద రూ.20 వేలు, సేవామిత్ర కింద రూ.10 వేల నగదుతో పాటు ధ్రువీకరణ పత్రాలను అందజేసి శాలువాతో సత్కరించనున్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

సేవలకు గుర్తింపు



వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పేదలకు సేవ చేసే అదృష్టాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. వలంటీర్‌గా ఎంపికవడం సంతోషంగా ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీన సామాజిక పింఛన్లతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది తాను సేవారత్న పురస్కారానికి ఎంపికవడం చాలా సంతోషంగా ఉంది.

– ప్రసన్నకుమార్, మినగల్లు

పనితీరుకు నిదర్శనం

రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ల పనితీరు ఆధారంగా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేస్తోంది. పురస్కారాలకు ఎంపికైన వారికి నగదు బహుమతితో పాటు ధ్రువీకరణ పత్రం అందజేసి శాలువాతో సత్కరిస్తుంది. తద్వారా వలంటీర్ల మరింత బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తోంది.



– నరసింహారావు, ఎంపీడీఓ, బుచ్చిరెడ్డిపాళెం

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ సంగమేశ్వరరావు



కొడవలూరు:క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకట నగేష్‌నాయుడు

పొదలకూరు : క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని పొదలకూరు సీఐ జీ సంగమేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో లింగంపల్లి యూత్ ఆధ్వర్యంలో మూడు మండలాల స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడల్లో రాణించాలన్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొత్తం 21 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి రూ.10,016, రన్నర్ జట్టుకు బిట్-4 ఎంపీటీసీ జీ.శ్రీనివాసులు రూ.7,016 నగదు బహుమతులను అందజేయనున్నట్లు వివరించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కొడవలూరు: చంద్రశేఖరపురంలో సీఎస్‌పురం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూడల చిన్నయ్య మెమోరియల్ క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు బెల్లం వెంకట నగేష్‌నాయుడు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ యువతను క్రీడల్లో పోత్సహించేందుకు కొడవలూరు, విడవలూరు, బుచ్చి, అల్లూరు, దగదర్తి మండలాల స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేత జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేలు, తృతీయ స్థానంలో నిచిన జట్టుకు రూ.10 వేలు వంతున నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతిమ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇవ్వనున్నట్లు వివరించారు. సర్పంచ్ చౌటూరు లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గరిక మస్తానయ్య, ప్రసన్నకుమార్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో సమృద్ధిగా ఎరువులు

కొడవలూరు: మండలంలోని ఆర్‌బీకేల్లో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ సీహెచ్ ఎస్ లక్ష్మి తెలిపారు.ఆలూరుపాడు ఆర్‌బీకేకు వచ్చిన ఎరువుల నిల్వలను ఆదివారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడగారు సాగుకు అవసరమైన మేరకు డీఏపీ, యూరియాను ఇప్పటికే ఆర్‌బీకేలకు చేర్చినట్లు చెప్పారు. ఆర్‌బీకేలో ఇండెంట్ పెట్టిన మరుసటి రోజే ఎరువులను పొందవచ్చని తెలిపారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలను యాభై శాతం రాయితీపై ఇస్తున్నామని తెలిపారు. ఎడగారు సాగు చేయని రైతులు వేసుకుని భూమిని సారవంతం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట వీఏఏ వెంకట పృథ్వీ ఉన్నారు.



ఎరువులను దిగుమతి చేసుకుంటున్న దృశ్యం

రేపట్నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు నియోజకవర్గంలో పదో విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. 23న బుచ్చిరెడ్డిపాళెంలోని 6,7 వార్డులు, 26న 8వ వార్డు, 27న 9వ వార్డు, జూన్ 21న పంచేడు, 22న బుచ్చిరెడ్డిపాళెంలోని 13వ వార్డులో పర్యటించనున్నారు. 24న కొడవలూరు మండలం యల్లాయపాళెం, 25న యల్లాయపాళెం పంచాయతీ రామాపురం, జూన్ 5,6 తేదీల్లో గండవరం, 27,28న కమ్మపాళెంలో పర్యటించనున్నారు. 28న ఇందుకూరుపేట మండలం కొత్తూరు చినతోపు, జూన్ 15,16,17,19,20 తేదీల్లో ఇందుకూరుపేటలో పర్యటిస్తారు. జూన్ 10,12,13,14 తేదీల్లో కోవూరులో పర్యటిస్తారు. జూన్ 7,8,9 తేదీల్లో ముదివర్తి, 23,24,26 తేదీల్లో విడవలూరులో పర్యటించనున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కొమ్మలపూడి జట్టు

మనుబోలు: పిడూరులో జరుగుతున్న ఆర్టీఆర్, ఆడిపూడి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో కొమ్మలపూడికి చెందిన హనుమాన్ క్రికెట్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పిడూరు మెయిన్ టీం 10 ఓవర్లలో 36 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం హనుమాన్ క్రికెట్ క్లబ్ జట్టు కేవలం 4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు షీల్డుతో పాటు రూ.15 వేల నగదు బహుమతి అందజేశారు. రన్నర్ జట్టుకు షీల్డుతో పాటు రూ.10 వేల నగదు అందజేశారు. టోర్నమెంట్ స్పాన్సర్ ఆడిపూడి రవితేజరెడ్డి, శివారెడ్డి, కృష్ణారెడ్డి, పవన్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, ఆర్గనైజర్లు వినయ్, శ్రీహరి, వెంకట్, వేణు, తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకున్న కొమ్మలపూడి జట్టు

యోగాపై అవగాహన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): శాస్త్రీయ యోగా శిక్షణ తరగతులపై అవగాహన సదస్సును బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో యోగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. యోగా శిక్షకులు చలపతి పాల్గొన్నారు.

తాటిపర్తిలో డ్రెయిన్ నిర్మాణం

పొదలకూరు : మండలంలోని మేజర్ పంచాయతీ తాటిపర్తిలో సైడ్‌డ్రెయిన్ పనులు పూర్తి కావస్తున్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాటిపర్తిలో పర్యటించిన సందర్భంలో గ్రామస్తులు వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయిన్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి కాకాణి స్పందించి యల్లమ్మ దేవస్థానం మీదుగా వాగు వరకు డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసననాయక్ పనులు చేపట్టి పూర్తి చేయిస్తున్నారు.



వీరాంజనేయస్వామికి విశేషాలంకారం

ముత్తుకూరు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ముత్తుకూరులోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం స్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీరాంజనేయస్వామికి వివిధ పుష్పాలు, పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమా హనుమంతరావు, సోమా శ్రీనివాసరావు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



మొలకపోలేరమ్మ జాతర ప్రారంభం

ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో కొలువైన మొలకపోలేరమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. మూడ్రోజుల పాటు జరిగే జాతరలో భాగంగా తొలిరోజు కలశ స్థాపన చేశారు. రెండో రోజైన సోమవారం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష హోమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు మంగళవారం పొంగళ్లు, అమ్మవారికి పూర్ణాహుతి, దర్శనం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



ముగిసిన విరామ బైబిల్ శిక్షణా తరగతులు

కోవూరు(విడవలూరు): విడవలూరు మండలం దండగుంటలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో జరుగుతున్న విరామ బైబిల్ శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బైబిల్‌పై చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవ ఇమ్మానుయేలు, సండే స్కూల్ టీచర్లు వనజాక్షి, సుప్రజ, సంఘ పెద్దలు కాగొల్లు మస్తానయ్య, విక్రమ్‌తేజ, పవన్, వినయ్ తెలుగు బాప్టిస్టు యూత్ సభ్యులు పాల్గొన్నారు.



పంటపాళేనికి సీఎస్సార్ సొబగులు

- పాఠశాలల్లో సౌకర్యాల కల్పన
- చెత్త తొలగింపునకు ట్రాక్టర్ అందజేత
- తాగునీటికి ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెం పంచాయతీ పామాయిల్ ఫ్యాక్టరీల హబ్. ఇక్కడ ఫ్యాక్టరీల సీఎస్సార్(సామాజిక బాధ్యత) నిధుల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు పంచాయతీ రూపురేఖలను మార్చివేశాయి. పంచాయతీ పరిధిలో పామాయిల్ ఉత్పత్తిలో 8 ఫ్యాక్టరీలు ఉండగా, వీటిల్లో కొన్ని పంచాయతీ అభివృద్ధికి సీఎస్సార్ నిధులు వ్యయం చేస్తున్నాయి. మరి కొన్ని ఫ్యాక్టరీలు సీఎస్సార్ నిధులను కలెక్టర్‌కు అందజేస్తున్నాయి. తద్వారా తమ వంతు సామాజిక బాధ్యత నిర్వర్తిస్తున్నాయి. పంటపాళెం పంచాయతీ జనాభా సుమారు 6వేలు కాగా, అందులో సగం మంది వివిధ ఫ్యాక్టరీల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేసే స్థానికేతరులు ఉన్నారు. పెరిగిన జనాభా దృష్ట్యా సౌకర్యాలు కూడా పెంచాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరు, విద్య, తదితర సౌకర్యాలు మెరుగు పరిచేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల సూచనల మేరకు ఫ్యాక్టరీల నిర్వాహకులు, ప్రతినిధులు పంచాయతీకి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు.

పచ్చదనం–పరిశుభ్రతకు ప్రాధాన్యం

పామాయిల్ ఫ్యాక్టరీలు సామాజిక బాధ్యత కింద పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూనే, జగనన్న పచ్చతోరణంపై దృష్టి సారించాయి. అందులో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచుతూ, వాటికి ట్రీ గార్డులు ఏర్పాటు చేశాయి. పంచాయతీలో దూరంగా ఉన్న పాఠశాలలు, వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాళెం హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థుల కోసం ఆటోలు సమకూర్చాయి. పాఠశాలకు ప్రహరీలు, ఫ్లోరింగులు, అదనపు గదులు, పేదల కాలనీలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సమకూరుస్తున్నాయి. మురుగునీటి పారుదలకు సైడు డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. పంటపాళెం పంచాయతీలోనే కాకుండా ఫ్యాక్టరీల పరిసర గ్రామాల్లో సైతం మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాయి. అడపాదడపా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ స్థానికుల ఆరోగ్య పరిరక్షణకు ఆసరాగా నిలుస్తున్నాయి.



బలిజపాళెం పాఠశాలలో సీఎస్సార్ నిధులతో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణం

సీఎస్సార్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు

ఫ్యాక్టరీ పేరు	కార్యక్రమం	నిధులు
జెమినీ ఎడిబుల్స్	ట్రాక్టర్, ట్యాంకర్	రూ.14 లక్షలు
	విద్యార్థులకు ఆటో	రూ.1.50లక్షలు
	మూడు ఆర్వో ప్లాంట్లు	రూ.12 లక్షలు
త్రిపుల్ ఎఫ్ ఇండస్ట్రీస్	రెండు బస్ షెల్టర్లు	రూ.5 లక్షలు
శ్రీకృష్ణ సౌత్‌ఇండియా	ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి	రూ.9 లక్షలు
ఎడిబుల్ ఆయిల్స్ అసోసియేషన్	కాలుష్య పరికరం	రూ.15లక్షలు
బొంగె ఆయిల్స్	బలిజపాళెం స్కూల్ అదనపు గదులు, ప్రహరీ	రూ.2 కోట్లు
కార్గిల్ ఎడిబుల్	పంటపాళెం దళితవాడ పాఠశాలకు క్రీడా పరికరాలు	రూ.3లక్షలు

మంచినీటి పథకాల నిర్మాణం చేపట్టాలి



పంటపాళెం పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించడంలో భాగంగా సీఎస్సార్ నిధులతో రక్షిత మంచినీటి పథకాల నిర్మాణం చేపట్టాలి. పెరిగిన జనాభా దృష్ట్యా పంచాయతీలో పేరుకుపోయే చెత్తను తొలగించేందుకు అవసరమైన కార్మికులను ఏర్పాటు చేయాలి. వారికి సకాలంలో జీతాలు చెల్లించాలి. గ్రామంలోని యూపీ స్కూల్‌లో అదనపు గదులు నిర్మించాలి.

–మారు సుధాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు

సీఎస్సార్ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో పామాయిల్ ఫ్యాక్టరీల సీఎస్సార్ నిధుల ద్వారా పలు అభివృద్ధి పనులు అమలవుతున్నాయి. ఫ్యాక్టరీల ద్వారా ఏటా రూ.40 లక్షలు పన్నుల రూపంలో పంచాయతీ ఖాతాలో జమవుతోంది. ఊటలసంఘంలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రం సమకూర్చేందుకు ఒక ఫ్యాక్టరీ అంగీకారం తెలిపింది. రెండు రక్షిత మంచినీటి పథకాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి.



–ఆలపాక శ్రీనివాసులు, సర్పంచ్, పంటపాళెం



కోళ్లమిట్టలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు



చెత్త తొలగింపునకు అందజేసిన ట్రాక్టర్(ఫైల్)



కోడెలమిట్ట వద్ద నిర్మించిన బస్‌షెల్టర్